

అంతుపట్టని లీజు వ్యవహారం..!

◆ అద్దెలు లేకుండా రాయదుర్గం మండల పరిషత్ వాణిజ్య భవన సముదాయాలు
◆ వేలం వేయకుండానే గదుల స్వాధీనం
◆ భవనాలను సొంతం చేసుకున్న అధికార పార్టీ నాయకులు
◆ జిల్లా, మండల పరిషత్ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన నూతన వాణిజ్యసముదాయం భవన నిర్మాణ పనులు 44 నెలల క్రితం పూర్తయ్యాయి. ఈ పనులు పూర్తయ్యి ఇన్నాళ్లు గడుస్తున్నా ఇంత వరకు వీటిని అధికారికంగా మండల పరిషత్ కార్యాలయానికి అప్పగించలేదు. శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా ఈ భవనాలు మండల పరిషత్ పరిధిలోకి రాలేదు. దీంతో వాణిజ్య సముదాయాల నుంచి రావాల్సిన ఆదాయాన్ని జిల్లా పరిషత్, మండల పరిషత్ కోల్పోతోంది. ఒక్కో గదికి రూ.3 వేలు చొప్పున(జిల్లా పరిషత్ నిర్దేశించిన బాడుగ ప్రకారం) అద్దె 44 నెలల కాలానికి సుమారు రూ.10.56 లక్షలు నష్టపోయింది. ఇదిలా ఉంటే రాయదుర్గం మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు మాత్రం అనధికారంగా వీటిని వారి స్వాధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గదులు వారివే అన్నట్లు కొందరు వీటికి తాళాలు కూడా వేసుకున్నారు.

గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాయదుర్గం పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా అనంతపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న మండల పరిషత్ కార్యాలయం ప్రహరీని కూల్చివేశారు. తరువాత ఈ ప్రాంతంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలని అప్పటి పాలకులు భావించి జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపారు. గహ నిర్మాణ శాఖ మంత్రి హోదాలో కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఛైర్మన్ హోదాలో పూల నాగరాజు వాణిజ్యసముదాయ భవన పనులను ప్రారంభించారు. 8 గదుల నిర్మాణానికి రూ.25లక్షలు కేటాయించారు. 2017 సంవత్సరం జిల్లా పరిషత్ ప్రత్యేక నిధులతో వీటిని నిర్మించారు. దీని నిర్మాణాలు జరిగాయి కానీ వీటిని వినియోగంలోకి తేలేదు. ప్రభుత్వ అధికారులు బదిలీలు కావడం, ఇతర కారణాలతో ప్రస్తుతం ఉన్న అధికారుల వద్ద దీనికి సంబంధించి పూర్తి సమాచారం లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే హోదాలో కాపు రామచంద్రారెడ్డి 2019 జులై 2వ తేదీన వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించారు. అప్పట్లో ఎంపిపిగా భారతి ఉండేవారు. ప్రస్తుతం విద్యావతి ఎంపీపీగా కొనసాగుతున్నారు. భారతి భర్త మల్లికార్జున ప్రస్తుతం



వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి (ఫైల్ ఫోటో)



వాణిజ్య భవన సముదాయం

రాయదుర్గం మండలం జడ్పిటిసిగా, విద్యావతి సోదరుడు బోర్వెల్ నాగిరెడ్డి వైసిపి మండల నాయకులుగా ఉన్నారు. వాణిజ్య సముదాయం విషయంలో ఈ నాయకుల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు తెలుస్తోంది. భవనాలను గుడ్‌విల్‌కు అమ్ముకున్నారని ఒకరి పేరు వినిపిస్తుండగా, ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు గదులను ఇతరులకు అధిక బాడుగులకు ఇచ్చుకున్నట్లు ఆరోపణలు చేసుకుంటున్నారు.

వేలంపాట ఊసే లేదు..

నిబంధనల మేరకు వాణిజ్య గదుల అద్దెను నిర్దేసిస్తూ బహిరంగ వేలంపాట వేయాలి. వేలంలో ఎవరు ఎక్కువకు పాడితే వారికే గదులు కేటాయిస్తారు. తద్వారా ఆదాయం పెరిగే అవకాశాలు ఉంటాయి. ఈ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా గదులు తమ సొంతం అన్నట్లుగా తాళాలు వేసుకున్నట్లు తెలుస్తోంది. ఒకరు ఆరు నెలలుగా, మరొకరు మూడు నెలలుగా ఇతరులకు ఎక్కువ బాడుగలకు ఇచ్చుకున్నట్లు అధికార పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. మరికొందరు గుడ్‌విల్ ఇచ్చుకుని గదులను స్వాధీనం చేసుకున్నారు. రాతపూర్వక అగ్రిమెంట్లు లేకుండానే ఇతరులకు అద్దెకిచ్చినట్లు తెలుస్తోంది. ఎనిమిది గదుల్లో జిల్లా పరిషత్‌కు 4, మండల పరిషత్‌కు 4 గదుల ప్రకారం బాడుగల రూపంలో ఆదాయం వస్తోంది. 2021 డిసెంబర్ 14వ తేదీన వాణిజ్యసముదాయ భవనాలు వాడుకలో తీసుకురావడానికి ఎంపిపి విద్యావతి ఆధ్వర్యంలో పాలకవర్గం తీర్మానం చేసి, జిల్లా పరిషత్‌కు పంపారు. జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణధికారి స్పందిస్తూ ఒక్క గదికి రూ.3వేలకు తక్కువ కాకుండా నిర్ణీత వ్యవధికి వేలం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. వాణిజ్య సముదాయం స్కెచ్, పూర్తి అయిన షాపుల అప్పగింత ధ్రువ పత్రములను డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజినీర్(పిఆర్ఐ) రాయదుర్గం, కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్అండ్‌బి డివిజన్ కళ్యాణదుర్గం వారి నుంచి ప్రస్తుతం అమలులో ఉన్న జీవో మేరకు అద్దె నిర్ణయం తీసుకోవాల్సిందిగా 2022 సెప్టెంబర్ 3వ తేదీన జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం 2022 సెప్టెంబర్ 7వ తేదీన కళ్యాణదుర్గం ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రాయదుర్గం పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు మండల పరిషత్ అభివద్ధి అధికారి లేఖ రాసినప్పటికీ సమాధానం రాలేదు. దీంతో 2022 అక్టోబర్ 7న అనంతపురం పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు మరో లేఖ రాశారు. అయినప్పటికీ సమాధానం రాకపోవడంతో మండల పరిషత్ అధికారి మిన్నకుండిపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీరాజ్ శాఖ నుంచి కంప్లీషన్ సర్టిఫికెట్(పూర్తి అయిన షాపుల అప్పగింత ధ్రువపత్రం) తీసుకున్నాక మండల పరిషత్ అధికారులకు వాణిజ్య సముదాయం అప్పగించినట్లుగా పరిగణలోకి తీసుకుంటారు. ఈ భవనాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి సమన్వయంతో బహిరంగ వేలంపాట నిర్వహిస్తే జిల్లా, మండల పరిషత్‌కు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుంది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్కో అధికారి ఒక్కో సమాధానం

ఈ భవనాల విషయంపై జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డిని, పంచాయత్ రాజ్ డిఈఈ రామ్మోహన్ రెడ్డిని, రాయదుర్గం ఎంపిడిఒ కొండయ్యను ప్రజాశక్తి వివరణ కోరింది. బహిరంగ వేలంపాట నిర్వహించేందుకు రాయదుర్గం మండల పరిషత్ వారికి అనుమతిని ఇచ్చామని జెడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి చెప్పారు. పైస్థాయి అధికారుల పరిధిలో ఉందని పంచాయతీ రాజ్ డిఈఈ రామ్మోహన్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవనానికి సంబంధించిన స్కెచ్, కంప్లీషన్ సర్టిఫికెట్ (పూర్తయిన షాపుల అప్పగింత ధ్రువపత్రం) పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఇస్తేనే వాణిజ్యసముదాయం మండల ప్రజా పరిషత్‌కు అధికారికంగా అప్పగించినట్లు అవుతుందని రాయదుర్గం ఎంపీడీవో కొండయ్య తెలిపారు. ఇలా ఒక్కో అధికారి ఒకోక రకమైన సమాధానం చెబుతున్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేద కుటుంబంలో జన్మించి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్న బాబూ జగ్జీవన్ రామ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కళ్యాణదుర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ చరణ్, అనంతపురం సప్తగిరి సర్కిల్ వద్దనున్న ఆయన విగ్రహానికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ ఆర్థిక, సామాజిక ఇబ్బందులను అధిగమించి ఉన్నత స్థానాలకు చేరుకోగలిగారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడం దగ్గరనుంచి స్వతంత్ర భారతావని నిర్మాణంలో మూడు దశాబ్దాల పాటూ తన సేవలు అందించారన్నారు. 1971 భారత్-పాకిస్తాన్ యుద్ధంలో రక్షణ మంత్రిగా దేశానికి ఘన విజయం అందించడంలో ఆయన ఎనలేని కషి చేశారన్నారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆహుడా ఛైర్‌పర్సన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ ఛైర్‌పర్సన్ నదీమ్ అహ్మద్, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహితీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విష్వమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మడకశిరలో దారుణం

◆ భార్యను బండరాయితో మోది హత్య ◆ ఆపై భర్త ఆత్మహత్య

కుటుంబ కలహాలు, ఆపై అనుమానం ఓ కటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఏకంగా భార్యను హత్య చేసి, అపై భర్త కూడా ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ దారుణ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలోని ఎగువరామగిరిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భర్త వెంకటేశ్వర్లు(40), భార్య రాధమ్మ(35)ను రాళ్లతో కొట్టి హత్య చేసి, అనంతరం అతనూ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ



హత్యకు గురైన రాధమ్మ

వార్త మెయిన్‌లో..



ఢిల్లీలో ధర్నా చేస్తున్న అనంతపురం రైతు సంఘం నాయకులు

రైతులకు మద్దతు ధర కల్పించాల్సిందే

ఢిల్లీలో జిల్లా రైతుల ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, వ్యవసాయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, రాజారామిరెడ్డి, విటి.రామాంజినేయులు తదితరులు హాజరై మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర, రుణమాఫీ చట్టం పార్లమెంట్‌లో చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవాను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్నారు. డ్రిప్, స్పింక్లర్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. పిఎం కిసాన్ సన్మాన్ ద్వారా జిల్లాలో డ్రిప్ స్పింక్లర్లు ఉచితంగా ప్రకటించాలన్నారు. పండ్ల తోటలకు అనుబంధంగా జ్యూస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉప సంహరించుకోవాలన్నారు. కరువు జిల్లా అనంతపురంలో పేద మధ్యతరగతి రైతులకు నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాయుడు, శ్రీనివాసులు, చెన్నారెడ్డి, పోతులయ్య, వెంకటకొండ నారాయణరెడ్డి, నాగమ్మ, చిదంబరమ్మ, రైతులు జయశేఖర్, రమేష్, పార్వతి, సుభద్రమ్మ, రామాంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, నిరుద్యోగులను మోసం చేసింది చంద్రబాబే : కాపు

ప్రజాశక్తి-కణేకల్లు

రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులను, మహిళలను మోసం చేసింది చంద్రబాబు నాయుడే అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బుధవారం కనేకల్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మూడో విడత ఆసరా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ.. గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైసిపి ప్రభుత్వం మహిళలకు, వృద్ధులకు, విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలను నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తోందని అన్నారు. అనంతపురం జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతోందన్నారు. ఆయన ఎప్పుడు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పద్మావతి, ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ లీలావతి సర్పంచి నిర్మల టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, మహబూబ్ పీరా, నబీసా, ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, శర్మాస్, వన్నూరుసా, మారెన్న పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిడిపి హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. వైసిపి ప్రభుత్వంలో శింగనమల నియోజకవర్గంలో రూ.179 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నేరుగా రూ.1400 కోట్లు అందాయని తెలిపారు. జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ ఛైర్మన్ హరిత, ఎంపీపీ సునీత, జడ్పీటీసీ భాస్కర్, సింగిల్ విండో ప్రెసిడెంట్, మండల కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచులు, తహాశీల్దారు మోహన్‌కుమార్, ఎంపీడీవో తేజోత్స్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ప్రతి పథకం ఓ మోసం..!

◆ హంద్రీనీవా పనుల పూర్తిపై నిర్లక్ష్యం
◆ టిడిపి అధికారంలోకి రాగానే ఈ పనులను పూర్తి చేస్తాం
◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్
◆ ఉరవకొండలో ఘన స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు



కూడేరు బహిరంగ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టే ప్రతి పథకంలోనూ ఓ స్కాం ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారం నాడు ఉరవకొండ నియోజకవర్గంలో సాగింది. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర గొట్కూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం క్రాస్, కమ్మూరు క్రాస్‌కు మధ్యాహ్నంకు చేరుకుంది. అక్కడ భోజన విరామం తరువాత తిరిగి ప్రారంభమైన సాయంత్రానికి కూడేరుకు చేరుకుంది. అక్కడ రాత్రికి బస చేశారు. టిడిపి ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ ఉన్న ఉరవకొండ నియోజకవర్గంలో భారీ జన సమీకరణ కనిపించింది. పెద్దఎత్తున ప్రజలు లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తూనే, స్థానిక సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా ప్రభుత్వ వైఫల్యాలు, సాగునీటి రంగంపై ప్రస్తావించారు. యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. మండలి ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన కాలి బెనికిందని, ఆయన అసహనంకు లోనై టేబుల్‌ను కాలితో తన్నడంతోనే బెనికిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే ప్రతి పథకంలోనూ ఒక స్కాం ఉంటుందన్నారు. అందుకే ఆయనున్న స్కాం మోహన్‌రెడ్డి అని తాను పిలుస్తానని చెప్పారు. చివరకు మద్యం అమ్మకాల్లోనూ అవినీతే ఉందని చెప్పారు. పంటకు పురుగుల మందులు కొడితే చనిపోవడం లేదుగాని, జగన్మోహన్‌రెడ్డి అమ్మే మద్యం మందు కొడితే చనిపోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, దళితులపైనా దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడి చేసిన వారిపై ఇంత వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. డ్రైవర్‌ను హత్య చేసిన కేసులో ఎమ్మెల్సీకి శిక్ష పడకపోగా, అతడికి ఘనస్వాగతం లభించిందని గుర్తు చేశారు. ఇక హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామని జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనలు మాటకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఉరవకొండ నియోజకవర్గంలో 80 వేల ఎకారలకు సాగునీరందిస్తామని హామీ ఏమైందని ప్రశ్నించారు. అదే విధంగా 50 వేల ఎకరాలకు సామూహిక బిందు,తుంపెర సేద్యం ద్వారా రూ.800 కోట్లతో టిడిపి హయాంలో చేపట్టిన ప్రాజెక్టు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు పిట్ట కొంచెం. అవినీతి ఘనం అన్న చందంగా ఉందని ఆరోపించారు. ఎడాపెడా భూములు కబ్జా చేసారని ఆరోపించారు. ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉరవకొండ ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ పోటీ చేస్తారని, ఆయన్ను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి పాదయాత్ర

లోకేష్ చేపట్టిన పాదయాత్ర నేటికి 62వ రోజుకు చేరుకోనుంది. ఈ యాత్ర ఉదయం ఎనిమిది గంటలకు కూడేరులో బస చేసిన ప్రాంతం నుంచి ప్రారంభం అవుతుంది. అరవకూరు, కమ్మూరుకు మధ్యాహ్నం భోజన విరామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభమై శింగనమల నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది. గార్లదిన్నె మండలం కోటంకకు సాయంత్రం 4.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 7.30 గంటలకు మార్తాడు గ్రామానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో..

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్


నారా లోకేష్ వైసిపి నేతలపై ఇష్టానుసారంగా మాట్లాడడం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలని మేయర్ వసీం హితవు పలికారు. బుధవారం తన ఛాంబర్‌లో మేయర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ నగర అభివృద్ధిపై, అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై చేసిన విమర్శలను ఖండించారు. అనంత కుటుంబం 40 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తోందని అన్నారు. ఆయన తండ్రి అనంత వెంకటరెడ్డి రెండు సార్లు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారన్నారు. వెంకటరామిరెడ్డి నాలుగు సార్లు ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని అన్నారు. వారి కుటుంబ చరిత్ర తెలుసుకుని నారా లోకేష్ మాట్లాడాలని సూచించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చూసి మాట్లాడకూడదని హితవు పలికారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నానని చెప్పుకునే నారా లోకేష్ అక్కడ నేర్చుకున్న సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. లోకేష్ తండ్రి రెండెకరాల భూమి ఉన్న కాలం నుండే అనంత వెంకట్రామిరెడ్డి కుటుంబం రాజకీయాలలో కొనసాగుతోందనే విషయం మీ పక్కనున్న నేతలను అడిగితే చెపుతారన్నారు. నారా లోకేష్ ఏనాడైనా ప్రజాక్షేత్రంలో గెలిచివుంటే అభివృద్ధి, సంక్షేమం గురించి తెలిసి ఉండేదన్నారు. బళ్లారి బైపాస్ నుండి పంగల్ రోడ్డు వరకు రూ.310 కోట్లతో జరుగుతున్న ఫోర్‌లైన్ రోడ్డు పనులు అనంత కృషి వల్లనే సాధ్యమని మేయర్ పేర్కొన్నారు. నగరంలో మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ ఏర్పాటు, ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవన నిర్మాణం, పీఏబీఆర్ ద్వారా నగరానికి శాశ్వత నీటి సరఫరా పథకం తీసుకురావడం, హాస్పిటల్ రోడ్డు నిర్మాణం వంటి ఎన్నో అభివద్ధి కార్యక్రమాలలో అనంత కృషి ఉందని గుర్తించాలన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం రూ.26 కోట్ల వ్యయంతో చేపడుతున్న బయో మైనింగ్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడే నైజం టిడిపి నేతలదే అన్నారు. గత ఐదేళ్ల టిడిపి పాలనలో ఈ విషయం అనేకమార్లు స్పష్టమైందన్నారు. కమిషన్ల కోసం కక్కుర్తిపడి అభివృద్ధిని టిడిపి నేతలు పక్కదారి పట్టించారన్నారు. కాబట్టే ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లుగా టిడిపికి నగరంలో స్థానం లేకుండా చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, సోని రమణ, చంద్రలేఖ, నాయకులు ప్రకాష్ రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికే యంత్ర పరికరాలు

ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతుల అభివృద్ధి కోసమే సబ్సిడీతో వైఎస్సార్ యంత్ర సేవా పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ పంచాయతీ ఎన్.తిమ్మాపురం గ్రామంలో వ్యవసాయ అధికారి పెన్నయ్య, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున ఆధ్వర్యంలో వైఎస్సార్ యంత్ర సేవా పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో మండల వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుని వారి వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉండాలనాడే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. అనంతరం స్వామి రైతు మిత్ర సంఘం సభ్యులైన తిమ్మ రాయుడుతో పాటు రైతులకు ట్రాక్టర్ ఇతర వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేసు, ఎంపిఇఒ భూపతి, వైసిపి నాయకులు కరణం భీంరెడ్డి, ఉమా శంకర్, సంఘ సభ్యులు రాముడు, నరసింహులు, సుధాకర్, అనంతమ్మ, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

పేదలకు అన్నదానం

గుత్తి : మణికంఠ స్టోన్ క్రషర్ అధినేత, వైసిపి నేత, 19వ వార్డు ఇన్‌ఛార్జి కె.మధుసూదన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేకులు కోసం పంచిపెట్టిరు. పేదలకు అన్నదానం చేశారు. క్రషర్ మధుకి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి బి శ్రీనివాస్‌రెడ్డి లు ఫోన్‌లో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు క్రషర్ మధు నివాసానికి చేరుకరని బాణసంచా పేల్చారు. శాలువాలు, పూలమాలలతో ఆయనను సత్కరించారు. అలాగే 24వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి బి.రమేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.

తగ్గిన చింతపండు ధరలు

రాయదుర్గం రూరల్ : గత వారంతో పోలిస్తే ఈ వారం చింతపండు ధరలు తగ్గుముఖం పట్టాయి. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన చింతపండు మార్కెట్‌కు 156.3 క్వింటాళ్ల చింతపండు వచ్చినట్టు కార్యదర్శి సునీత తెలిపారు. ఫ్లవర్ రకం చింతపండు రూ.4500 నుండి రూ.7 వేలు దాకా, కరిపుళి రకం చింతపండు రూ.10,500 నుండి రూ.15,500 దాకా ధరలు పలికాయి.

బీమా ఉద్యోగుల నిరసన

రాయదుర్గం : ఢిల్లీలో బుధవారం జరిగిన కిసాన్ సంఘర్షణ ర్యాలీకి మద్దతుగా రాయదుర్గంలో భారతీయ జీవిత బీమా సంస్థ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, రవీంద్ర, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మల మురళి నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్న దాదాపు 150 మంది ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు మరింత సహాయం చేయడానికి కృ చేస్తామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కిష్టప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం

సిపిఎం గుంతకల్లు పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు ప్రారంభించగా, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాది కాలంగా ఆపరేషన్ థియేటర్ లేదన్నారు. గర్భిణులకు అత్యవసర సమయాల్లో ఆపరేషన్ చేయాల్సివస్తే జిల్లా ఆసుపత్రికి రెఫెర్ చేసి ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వేలకు వేలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. ఓటీ లేని కారణంగా కుటుంబ నియంత్రణ, కిడ్నీ వంటి శస్త్ర చికిత్సలకు అనంతపురం, కర్నూలుకు వెళ్లాలని సూచిస్తున్నారన్నారు. ఇతర విభాగాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నా వైద్యం చేయకుండా డబ్బులు చెల్లిస్తేనే వైద్యం చేస్తామనే విధంగా ప్రయివేటు యాజమాన్యం వ్యవహరిస్తోందని అన్నారు. పట్టణంలో అనేక వార్డుల్లో తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలకు కల్పించకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాల్లోని కాలనీలలో నివసిస్తున్న ప్రజలు తాగునీరు, రోడ్లు వీధి దీపాల మౌలిక సదుపాయాలకు ఆమడదూరంలో ఉన్నారని అన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు రుణాలు ఇవ్వాలన్నారు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు రిలే దీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొదటి రోజున



మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివా సులు, కార్యవర్గ సభ్యులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, జగ్గలి రమేష్, రాము నాయక్, ఓబులేసు దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, ఆవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్లా, జకీర్, షాషా, భగత్ సింగ్, ఆటో యూనియన్ నాయకులు రాజేష్, ఆటో మల్లి, చరణ్, నాగార్జున, చిరు వ్యాపారుల సంఘం నాయకులు తిమ్మప్ప తదితరులు మద్దతు తెలిపారు.

ఢిల్లీ వీధుల్లో ఆకులు కట్టుకుని వినూత్న నిరసన



ఆకులు కట్టుకుని నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నా సందర్భంగా ఆకులు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా సిఐటియు కార్మికులు ఢిల్లీ నడివీధుల్లో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. అర్ధ నగ్నంగా ఆకులు కట్టుకుని మోడీ విధానాల వల్ల తమ జీవితాలు సర్వనాశనం అయిపోయాయని తెలిపారు. ఆదాని, అంబానీ ప్రయోజనాలు తప్ప కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రయోజనాలు ఏమాత్రం పట్టడం లేదన్నారు. మోడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఢిల్లీ వీధిలో నినాదాలు ఇచ్చుకుంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. వీరి ధర్నాకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ముఖ్య అతిథిగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుచేయాలని, అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీకి రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. స్కీమ్ వర్కర్లతో సహా కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు అమలు చేయాలన్నారు. పనికి ఆహార పథకాన్ని విస్తరింపచేయాలన్నారు. రోజుకు రూ.600 కనీస వేతనంతో పనిదినాలను 200కి పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని వేతనాలను చెల్లించాలని, జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలన్నారు. ధరల పెరుగుదలను అరికట్టాలన్నారు. ఆహార పదార్థాలు, నిత్యావసరాలపై ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. పెరిగిన వంట గ్యాస్ ధరలను అదుపు చేసి ధరలు తగ్గించాలన్నారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ విస్తరించాలని కోరారు. 14 ముఖ్యమైన నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ)ని కఠినంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, ఎటిఎం.నాగరాజు, బత్తల ఆదినారాయణ, సాకే నాగరాజు, వరలక్ష్మి, నల్లప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ వైడనింగ్ ప్రాజెక్ట్ తెచ్చినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తా

నారా లోకేష్‌కు ఎమ్మెల్యే అనంత సవాల్

ప్రజాశక్తి-అనంతపురం

పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు చేపట్టిన అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్‌ను తెలుగుదేశం పార్టీ హయాంలోనే తెచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంచలన ప్రకటన చేశారు. మంగళవారం యువగళం పాదయాత్రలో భాగంగా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చేసిన వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే అనంత తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మిడిమిడి జ్ఞానంతో వాళ్లు మాట్లాడిన మాటలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. కానీ వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. లోకేష్ అజ్ఞాని అని ఇన్నాళ్లూ అందరూ అంటుంటే ఏదో అనుకున్నానన్నారు. నిన్న బహిరంగ సభలో ఆయన వ్యాఖ్యలు చూశాక లోకేష్ అజ్ఞానం తెలిసిందన్నారు. ఇతరుల మౌత్‌పీస్‌గా లోకేష్ ఉంటాడని నిరూపితమైందన్నారు. ప్రభుత్వంపైన, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మీద, తనపైన అవాకులు చవాకులు పేలారని అన్నారు. లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదన్నారు. పక్కనోళ్లు చెప్పినంత మాత్రాన ఏది వాస్తవమో తెలుసుకోకపోతే ఎలాగని ప్రశ్నించారు. యువగళం పాదయాత్ర పేరుతో ఏ నియోజకవర్గంలోకి వెళ్తే అక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేలపై బురదజల్లి వాళ్లే కడుక్కుంటారన్న ధోరణిలో లోకేష్ సాగుతున్నాడని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలోనే అనంతపురం అభివృద్ధి చెందిందని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు అనంతపురంలో ఏం జరిగిందో ఇక్కడి ప్రజలందరికీ తెలుసన్నారు. నిత్యం శాంతిభద్రతలకు విఘాతం కల్పించారన్నారు. ఇప్పుడు అనంతపురం ప్రశాంతంగా ఉందని చెప్పారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడ, ఎవరి కొంప కూలగొడతారోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి ఉండేదన్నారు. అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్‌ను మీరు తెచ్చిందే నిజమైతే 2015లో నేషనల్ హైవే పరిధిలో ఉన్న రోడ్డును ఎందుకు ఆర్అండ్‌బి పరిధిలోకి తెచ్చారని సూటిగా ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో, తనకున్న పరిచయాలతో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఆర్అండ్‌బి నుంచి నేషనల్ హైవేస్‌లోకి మార్చినట్లు స్పష్టం చేశారు. అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సిఎం జగన్ స్వయంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైసిపి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్‌కు అంత ఉబలాటంగా ఉంటే హిందూపురంలో ఆయన ముద్దుల మామయ్యతో సహా టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. అప్పుడు ప్రజల అభిప్రాయం తెలుస్తుందన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి



పుట్లూరులో యువగళం పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరు మండలంలో ఈనెల 11వ తేదీ లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండల నాయకులతో సమావేశమయ్యారు. లోకేష్ పాదయాత్రకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెద్దపప్పూరు పరిసర గ్రామాల సమీపంలో మధ్యాహ్న భోజనం, రాత్రి జూటూరు గ్రామ సమీపంలో లోకేష్ బస చేసేందుకు అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రఘు, నాయకులు రామకృష్ణారెడ్డి, పెండేకల్లు భాస్కర్‌రెడ్డి, జూటూరు శశిధర్‌రెడ్డి, లోకనాథ్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, చిన్న పప్పూరు ప్రతాపరెడ్డి, మైనార్టీ నాయకులు షెక్షావలి, చాగల్లు శంకర్, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలో మూడురోజుల పాటు జరిగే యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు నాయకులకు సూచించారు. బుధవారం ఆమె టిడిపి నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో సమస్యలు ఏమైనా ఉంటే వాటిని అర్జీ రూపంలో నారా లోకేష్‌కి ఇవ్వవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పవన్ కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు శివశంకర్ రెడ్డి, రవిచంద్ర నాయుడు, రామాంజినేయులు, కడవకల్లు గోవర్ధన రాజు, చెర్లోపల్లి రవికుమార్ నాయుడు, శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంతకల్లు

తిరుపతిలో ఈనెల16, 17, 18 తేదీలలో జరగనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఐఎఫ్‌టియు జాతీయ మహాసభల ప్రచార వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని తిరుపతిలో ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలు జరుగడం సంతోషమన్నారు. సభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులపై ఉక్కుపాదం మోపుతోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, సౌకర్యాలను హరించి వేస్తోందన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తోందని మండిపడ్డారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నదన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు బహుళ జాతి కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూ దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం ద్వారానే అడ్డుకోగలుగుతామని అన్నారు. అందుకోసం భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించడానికి జాతీయ మహాసభల్లో తీర్మానాలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు డివిజన్ కమిటీ కార్యదర్శి చిన్నా, కమిటీ సభ్యులు రఘునాథ రెడ్డి, జిలాన్, పిఒడబ్ల్యూ నియోజకవర్గం కార్యదర్శి ఆశాబీ, పట్టణ కార్యదర్శి మాబున్ని తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం



పోస్టర్లు విడుల చేస్తున్న విప్ కాపు

స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం విడుదల చేశారు. అనంతరం కాపు మీడియాతో మాట్లాడుతూ టిడిపి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లేదన్నారు. నీరు– చెట్టు, దోమలపై దండయాత్ర, రెయిన్ గన్ పేరిట టిడిపి ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేసిందన్నారు. అలాంటి డబ్బుతో నేడు రాష్ట్రంలో ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు కట్టినట్లు తెలిపారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నాడు–నేడు పేరిట అభివృద్ధి ఆధునికీకరణకు నోచుకున్నాయన్నారు. నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం నేడు కనిపిస్తున్నాయన్నారు. అప్పుడు ఇప్పుడు అప్పులు ఉన్నాయనేది వాస్తవం అన్నారు. అప్పుచేసి దోపిడీ చేసిన ఘనత చంద్రబాబుది అన్నారు. ప్రజలను ఆదుకుని సంక్షేమం వారి ఖాతాలో వేసి గడపగడపకూ చేర్చారన్నారు. గతంలో జరిగిన మోసాన్ని నేటి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. మళ్లీ మళ్లీ జగన్ సీఎం కావాలని, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని, అందుకే 'మా నమ్మకం నువ్వే జగన్' అని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలీ బాషా, మున్సిపల్ వార్డు సభ్యులు షబ్బీర్, మాజీ సభ్యులు వసంతరాజు, పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, దిల్, ఓబా, పవన్, నిజాం పాల్గొన్నారు.

గళం లేని నాయకుడు నారా లోకేష్

అనంతపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గళం లేని నాయకుడని వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఇచ్చిన స్క్రిప్ట్ చదవకుండా తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. అవాస్తవాలు కాకుండా అనంతపురం అభివృద్ధి గురించి, అనంత వెంకటరామిరెడ్డి గురించి తెలుసుకుని మాట్లాడాలని తెలియజేశారు.

సమీక్ష సమావేశం

శింగనమల : టిడిపి మండల కన్వీనర్ పట్నం నగేష్ ఆధ్వర్యంలో కొరివిపల్లి గ్రామ సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జగనన్నే మా భవిష్యత్తు' నినాదాన్ని ఊరూవాడా వినిపించాలన్నారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి రాధా, ఎంపిపి యోగేశ్వరి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, జెసిఎస్ కన్వీనర్ వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వాలంటీర్లు, గృహసారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.50 వేలు ఆర్థికసాయం

బెలుగుప్ప : ఇటీవల గుండ్లపల్లి సమీపాన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వడ్డే గంగాధర్‌కు 1990 పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం వారు ఆస్పత్రికి వెళ్లి గంగాధర్‌ను పరామర్శించారు. రూ.50 వేలు గంగాధర్ భార్యకు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భ్రమరాంబ మల్లికార్జునుడి కల్యాణం

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా తెల్లవారుజాము నుంచే మల్లేశ్వర స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అభిజిత్ లగ్నమందు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారికి కల్యాణం నిర్వహించారు. స్వామివారి వైపునుంచి నాగరాజు దంపతులు, అమ్మవారి తరుపున రంగస్వామి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సమానత్వమే బాబూజీ కలలుగన్న స్వరాజ్యం

ప్రజాశక్తి-అనంతపురం

సమానత్వమే బాబూజీ కలలుగన్న స్వరాజ్యమని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరేపల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం మెడికల్ కళాశాలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించి, అంటరానితనాన్ని నిర్మూలించడానికి, అస్పృశ్యతను పోగొట్టడానికి, సమాజంలో అందరూ సమానత్వంతో బతకడానికి బాబూజీ పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ శంకర్, సహాచార్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ శారద, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, సహాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

కెఎస్ఆర్ కళాశాల ఎదుట ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కెవిపిఎస్ నాయకులు పూల మాలలువేసి నివాళులు అర్పించారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప హాజరై మాట్లాడుతూ దళిత నాయకుడిగా, సామాజిక సంస్కర్తగా ఆయన చేసిన కృషి గొప్పదన్నారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో దళిత, గిరిజనుల సంక్షేమ అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అక్కులప్ప, వెంకటేష్, నాయకులు నరసింహ, నాగేంద్ర, గోపి, శేఖర్, రమేష్ బాబు, శివ పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర, యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవ అధ్యక్షులు రమణయ్య, జిల్లా అధ్యక్షులు లింగమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, గంగాధర, శేషప్ప, పవన్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో..



జెఎన్‌టియులో..

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దారు శ్రీలత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు బాలరాజు, అబూబకర్, వీఆర్ఏలు పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ కూడలిలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంజన ప్రసాద్, గౌరవాధ్యక్షులు రామదాసు, ఎన్.ఈరన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, బీఎస్పీ నాయకులు బండల రామాంజినేయులు, భీమలింగ శ్రీధర్



గుత్తిలో..



నివాళి అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

గౌడ్, హమాలీ నాగేంద్ర, నాగేష్, టీచర్ నాగరాజు, గుత్తి కోట గైడ్ రమేష్, అబ్బేదొడ్డి లాలెప్ప, ఓబులేసు, కొజ్జేపల్లి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాకే భాస్కర్, దళిత గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్, ఉద్యోగ, ఉపాధ్యాయ, దళిత సంఘాల నేతలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ ఉద్యోగి గోపాల్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్ర బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో దళితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి, ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల జిల్లా అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, దళిత ఉద్యోగ సంఘాలు నేతలు కృష్ణ, వన్నప్ప, మల్లెల వేణు ప్రసాద్, లక్ష్మన్న, వైసిపి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.